జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 19 | జనవరి | 2026 • పేజీలు : 6

# గోదావరి నదిని తల్లితో సమానంగా భావిస్తాం...

**గోదావరి నదీ హారతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**




**భద్రాచలం, జనవరి 18,ప్రజాజ్యోతి :** వేద కాలం నుంచే గోదావరి నదిని తల్లితో సమానంగా భావిస్తూ వస్తున్నామని, వేదాల్లో నదికి సంబంధించిన అనేక సూక్తులు, ప్రార్థనలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. భద్రాచలంలో ఆదివారం నిర్వహించిన గోదావరి నదీ

మిగతా 2 లో...

# నైనీ బొగ్గు బ్లాక్... వివాదం

- నైనీ బ్లాక్ టెండర్ చుట్టూ రాజకీయ - మీడియా దుమారం
- ఫీల్డ్ విజిట్ నిబంధనతో మొదలైన వివాదం
- టెండర్ ఆరోపణలపై భట్టి విక్రమార్క ఖండన
- మీడియా కథనాలపై అధికారుల గట్టి స్పందన
- బొగ్గు బ్లాక్ టెండర్ ప్రక్రియ నిభంద నలపై అనుమానాలు
- నిబంధన చట్టబద్ధతే అయిన, అమలు వివాదంగా మారింది
- ఈ అంశం పై కోల్ బెల్ట్ లో వేడి చర్చ
- రాష్ట్ర రాజకీయాలను, మీడియాను, వ్యవస్థను కుదిపేసిన సంఘటన





3 లో..

ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ తో మొదలైన వ్యవహారం ఇప్పుడు కోల్ బెల్ట్ ప్రాంతలతో పాటు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు కారణమైంది. మొదట ఇది ఒక సాధారణ సింగరేణి గనుల టెండర్ గా కనిపించినా, క్రమంగా సింగరేణి యాజమాన్యం, రాజకీయ నాయకులు, మీడియా యాజమాన్యం, అధికార వ్యవస్థల మధ్య ప్రయోజనాల ఘర్షణగా మారింది. దీంతో ఈ వివాదం రాష్ట్ర రాజకీయ వాతావరణానికే కాదు, మీడియా విశ్వసనీయతకు, పరిపాలనా నైతికతకు కూడా సవాల్ గా మారింది.

• సింగరేణి ప్రతినిధి, ప్రజాజ్యోతి

# అన్నదానంపై... అసత్య ప్రచారం

- ఈవో ఆకస్మిక తనిఖీతో వెలుగులోకి నిజాలు



**భద్రాచలం, జనవరి 18, ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థాన అన్నదాన సత్రంలో భక్తులకు మధ్యాహ్నం రెండు గంటల వరకే భోజనం అందజేస్తున్నారని, వందలాది మంది భక్తులు తిరిగి వెళ్లిపోతున్నారని సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు జరిగినట్లు ఈఓ దామోదర్ రావు గుర్తించారు. ఈ విషయంపై నిజ నిర్ధారణ కోసం జనవరి 18న మధ్యాహ్నం రెండు గంటల ముప్పై నిమిషాల సమయంలో కార్యనిర్వహణాధికారి కె దామోదర్ రావు స్వయంగా అన్నదాన సత్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భక్తులకు తప్పుడు

మిగతా 2 లో...

# యువతలో క్రీడా స్ఫూర్తిని నింపిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా

- గోపాలపురంలో వాలీబాల్ టోర్న మెంట్ ప్రారంభం



**దమ్మపేట, జనవరి 18 (ప్రజాజ్యోతి):** గ్రామీణ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలనే లక్ష్యంతో గోపాలపురం, గుర్వాయిగూడెం, జమేధారు బంజరు గ్రామాల యువకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ ను అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. టోర్నమెంట్ ప్రారంభం అనంతరం మెచ్చా క్రీడాకారులను పరిచయం చేసుకొని స్వయంగా వాలీబాల్ ఆడి యువతను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మెచ్చా మాట్లాడుతూ,

మిగతా 2 లో...

## అన్నదానంపై అసత్య ప్రచారం

(మొదటి పేజీ తరువాయి...)
సమాచారం అందించిన చాట్ల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి దేవస్థాన సిబ్బంది కాదని, అంగవైకల్యం కలిగిన వ్యక్తిగా ప్రతిరోజూ అన్నదాన సత్రంలో భోజనం చేస్తూ ఉంటాడని నిర్ధారణ అయింది. అదే రోజున భక్తులకు మధ్యాహ్నం మూడు గంటల ముప్పై నిమిషాల వరకు అన్నప్రసాదం అందించబడినట్లు సీసీ టీవీ ఫుటేజీ ద్వారా స్పష్టమైంది. అయితే రైస్ అయిపోయిన సమయంలో మళ్లీ వండేందుకు కొంత సమయం పట్టిన సందర్భంలో, సదరు వ్యక్తి ఉద్దేశ్యపూర్వకంగా మధ్యాహ్నం రెండు గంటల వరకే భోజనం అని చెప్పి భక్తులను తిరిగి పంపుతూ దేవస్థానంపై దుష్ప్రచారం చేసినట్లు అధికారులు తెలిపారు. దేవస్థాన కీర్తి ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా వ్యవహరించినందున, సదరు వ్యక్తిపై పోలీసు కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శ్రీస్వామివారి దర్శనార్థం వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, సమయం లేదా టోకెన్ తో సంబంధం లేకుండా నిరంతరంగా అన్నదాన ప్రసాదం అందిస్తున్నామని అధికారులు స్పష్టం చేశారు. ఇటీవల వచ్చిన భక్తులందరికీ కూడా మధ్యాహ్నం మూడు గంటల ముప్పై నిమిషాల వరకు అన్నప్రసాదం అందించామని వెల్లడించారు. అన్నదానంపై జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యమని, దురుద్దేశ్యపూర్వకంగా దేవస్థాన ప్రతిష్ఠను దెబ్బతీయడానికి చేసినదేనని అధికారులు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని భక్తులందరికీ తెలియజేయడానికి పత్రికలు, వార్తా ఛానళ్ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

## యువతలో క్రీడా స్ఫూర్తిని నింపిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా



(మొదటి పేజీ తరువాయి...)
ఆటలు మానసికంగా, శారీరకంగా దృఢత్వాన్ని పెంపొందిస్తాయని, ప్రతి యువకుడు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. అధికారం ఉన్నా లేకున్నా యువత క్రీడా అభివృద్ధికి తన పూర్తి మద్దతు ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కొయ్యల అచ్యుత్ రావు, మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, దారా యుగంధర్, దమ్మపేట ఎస్.ఐ.సాయి కిశోర్ రెడ్డి, సోయం వీరభద్రం, మన్నెం అప్పారావు, పాశం ప్రసాద్, యార్లగడ్డ శ్రీను, అశోక్, ఏసు, శ్రీను, రాంబాబు, పిట్టల నవీన్, పానుగంటి గణేష్, లక్కీ, నాని పాల్గొన్నారు.

## గోదావరి నదిని తల్లితో సమానంగా భావిస్తాం...



(మొదటి పేజీ తరువాయి...)
హారతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అరణ్యవాసానికి వచ్చిన సందర్భంలో సీతాదేవి గోదావరి నదిని దేవతగా భావించిందని, నదిలో లభించే వనరులు మానవ జీవనానికి ఆధారమని వేద పండితులు పేర్కొన్న అనేక సందర్భాలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. అనంతరం అర్చక స్వాములు వేదమంత్రాల ఉచ్చారణతో గోదావరి నదీ హారతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శంఖనాదం మధ్య పుష్పాలు సమర్పిస్తూ గోదావరి నదికి ఘనంగా హారతి సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు గోదావరి నదీ హారతి ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. 'రామ లక్ష్మణ జానకి జై బోలో హనుమాన్ కి జై' అనే జయజయధ్వానాలతో గోదావరి పరివాహక ప్రాంతమంతా మారుమోగింది. నది తీర ప్రాంతాలు భక్తి భావంతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుని, భక్తులు మైమరిచిపోయారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి దామోదర్ రావు, తహసీల్దార్ దనియాల వెంకటేశ్వర్లు, దేవస్థానం అధికారి రవీందర్, గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

## మరువగలమా.... నిన్ను మహానీయుడా..

- ఎన్టీఆర్ ది అసామాన్య చరిత్ర తెలుగు వారికి కీర్తిప్రతిష్టలు తెచ్చిన ఘనత ఆయనది.. కట్రం స్వామిదొర.. తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్



**అశ్వారావుపేట, జనవరి18, ప్రజాజ్యోతి:** తెలుగువారి కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత నందమూరి తారక రామారావుదని అటువంటి మహనీయుని సృష్టి ఉన్నంతకాలం ప్రజలు మరువలేరని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కట్రం స్వామి దొర, మండల అధ్యక్షుడు నార్లపాటి శ్రీనివాస్ అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు 28వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని వివేకానంద కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి తెదేపా నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి తెచ్చిన చరిత్ర ఎన్టీఆర్ దని అధికారం అంటే ఆస్వాదించడానికి కాదు ప్రజలకు సేవచేయడానికి అని చేసి చూపిన నిస్వార్థ నాయకుడు ఆయనేనన్నారు. సమాజంలోని కొన్ని వర్గాలకే పరిమితమైన అధికారాన్ని అట్టడుగు స్థాయిలో ఉన్న అణగారిన వర్గాలకు చేరువ చేసి వారిని రాజకీయంగా నిలబెట్టారన్నారు. సంక్షేమ పథకాలను నిరుపేద ప్రజలకు అందించి వారి గుండెల్లో చిరంజీవిగా నిలిచారని కొనియాడారు. టిడిపి మండల నాయకులు, అంకోలు వెంకటేశ్వరరావు, రోహిణి కుమార్, బ్రహ్మం, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## చేపలు, చికెన్, మాంసం దుకాణాలపై విస్తృత తనిఖీలు

- 12 కేసులు నమోదు
- తూనికలు కొలతలు శాఖ అధికారి మనోహర్



**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 18: ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో వినియోగదారుల హక్కుల పరిరక్షణలో భాగంగా, ఆదివారం తూనికలు కొలతలు శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం సంత ప్రాంతం, కొత్తగూడెం పట్టణం అన్నపూరెడ్డిపల్లి మండలంలోని చేపలు, చికెన్, మాంసం విక్రయ దుకాణాలపై విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించడమైందని తూనికలు కొలతలు శాఖ అధికారి కే. మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తనిఖీలలో తూనికలు కొలతల చట్టం, సంబంధిత నిబంధనలను ఉల్లంఘిస్తూ ధృవీకరణ లేని తూకపు యంత్రాలు వినియోగించడం, సరైన ముద్రలు లేకుండా తూకాలు నిర్వహించడం, కొలతల్లో తేడాలు చూపించడం వంటి అక్రమాలు గుర్తించబడినట్లు తెలిపారు. ఈ ఉల్లంఘనలపై మొత్తం 12 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. తూనికలు కొలతల చట్టాన్ని ఉల్లంఘించిన వ్యాపారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని అన్నారు, వినియోగదారులను మోసగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. అన్ని రకాల వ్యాపారులు తప్పనిసరిగా ప్రభుత్వ ధృవీకరణ పొందిన తూకపు యంత్రాలనే వినియోగించాలని, నిర్ణీత కాలవ్యవధిలో పునఃధృవీకరణ చేయించుకోవాలని సూచించారు. వినియోగదారులు కూడా తూకాల్లో అక్రమాలు గమనించినట్లయితే జిల్లా తూనికలు కొలతలు శాఖ కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని కోరారు.భవిష్యత్తులో కూడా జిల్లాలోని సంతలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని తూనికలు కొలతలు శాఖ అధికారి మనోహర్ తెలిపారు.

## పురపోరుకు జనసేన సై

- అన్ని వార్డులలో పోటీ చేస్తాం
- పొత్తు సంగతి అధినాయకత్వం చూసుకుంటుంది...... వేముల కార్తీక్.....జనసేన పార్టీ జిల్లా ఇంచార్జ్



**అశ్వారావుపేట, జనవరి 18, ప్రజాజ్యోతి:** త్వరలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికలలో అశ్వారావుపేట మున్సిపాలిటీలో జనసేన పార్టీ అన్ని వార్డులలోను పోటీ చేస్తుందని జిల్లా ఇన్చార్జ్ వేముల కార్తీక్, అన్నారు ఆదివారం సాయిరంగ ఫంక్షన్ హాల్ వద్ద జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అధినాయకత్వం సూచన మేరకు అవసరమైతే పొత్తులోనూ లేకపోతే ఒంటరిగనైనా పోటీ చేస్తామన్నారు. జనసేన పార్టీకి నిబద్ధత కలిగిన కార్యకర్తలు ఉన్నారని, వారికి ఎన్నికలలో పోటీ చేసే అవకాశం కల్పిస్తామని, బలమైన వార్డులను ఎంపిక చేసుకొని పోటీలో ఉంటామన్నారు. ప్రజలకు స్థానిక సమస్యలను వివరిస్తూ వాటిని ఎలా పరిష్కరిస్తామో చెప్పి వారిని ఓటు అభ్యర్థిస్తామన్నారు. ప్రతి వార్డుకు ఒక ఇన్చార్జి నియమించి పోటీ చేసే అభ్యర్థికి అవసరమైన సలహాలు సూచనలు ఇస్తూ అండగా ఉంటామని అవసరమైతే రాష్ట్రస్థాయి జనసేన నాయకులు కూడా ప్రచారానికి వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి డేగల రామచంద్రరావు నియోజకవర్గ నాయకురాలు ఉమా, మండల అధ్యక్షుడు వినోద్, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి మండల అధ్యక్షులు రహీమ్, ప్రవీణ్, కిషోర్ ప్రధాన కార్యదర్శి ఆనంద్, బాల శ్రీ అయ్యప్ప పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


- గురువులను ఘనంగా సన్మానించిన పూర్వ విద్యార్థులు





**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 18: ప్రజా జ్యోతి** పాల్వంచ పట్టణంలోని నవత పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు ఆత్మీయ కలయిక వేదికగా ఏర్పాటు చేసుకొని వారి అనుభూతుని పంచుకుంటూ, ఎందరో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించిన గురువులను ఘనంగా సన్మానించుకున్నారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడుగా, పాల్వంచ సీనియర్ జర్నలిస్టుగా పనిచేస్తూ పలువురి మన్ననలు పొందుతున్న ఎండి జైనుల్లా బుద్దిన్ సేవలను పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఎంతో సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో గురువులు (టీచర్స్) జైనుల్లా, సైదులు, పూసపాటి సాయి కృష్ణ, రఘురాం, జివిఎస్ కుమార్, స్వరూప రాణి, మనీ, రజిని, ఇంద్రజ, ఆదిలక్షి , విద్యార్థులు శరత్, రవి, ప్రణీత్, గోపి, వంశీ, ప్రవీణ్, దీప్తి, శశికళ, తదితరులు పాల్గొన్నారు

- నైనీ బ్లాక్ టెండర్ చుట్టూ రాజకీయ - మీడియా దుమారం
- ఫీల్డ్ విజిట్ నిబంధనతో మొదలైన వివాదం
- టెండర్ ఆరోపణలపై భట్టి విక్రమార్క ఖండన
- మీడియా కథనాలపై అధికారుల గట్టి స్పందన
- బొగ్గు బ్లాక్ టెండర్ ప్రక్రియ నిబంధనలపై అనుమానాలు
- నిబంధన చట్టబద్ధతే అయిన, అమలు వివాదంగా మారింది
- ఈ అంశం పై కోల్ బెల్ట్ లో వేడి చర్చ
- రాష్ట్ర రాజకీయాలను, మీడియాను, వ్యవస్థను కుదిపేసిన సంఘటన





# నైనీ బొగ్గు బ్లాక్... వివాదం

ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ తో మొదలైన వ్యవహారం ఇప్పుడు కోల్ బెల్ట్ ప్రాంతలతో పాటు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు కారణమైంది. మొదట ఇది ఒక సాధారణ సింగరేణి గనుల టెండర్ గా కనిపించినా, క్రమంగా సింగరేణి యాజమాన్యం, రాజకీయ నాయకులు, మీడియా యాజమాన్యం, అధికార వ్యవస్థల మధ్య ప్రయోజనాల ఘర్షణగా మారింది. దీంతో ఈ వివాదం రాష్ట్ర రాజకీయ వాతావరణానికే కాదు, మీడియా విశ్వసనీయతకు, పరిపాలనా నైతికతకు కూడా సవాల్ గా మారింది.

● సింగరేణి ప్రతినిధి, ప్రజాజ్యోతి

**సమస్య ఎక్కడ మొదలైంది..?**

సింగరేణి పరిధిలో కొత్తగా అభివృద్ధి చేయనున్న గనులు, కొత్త బ్లాకులకు టెండర్ వేసే సంస్థలు తప్పనిసరిగా గనుల ప్రాంతాన్ని ప్రత్యక్షంగా సందర్శించి ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ పొందాలన్న నిబంధనను సంస్థ కొన్ని నెలల క్రితమే అమల్లోకి తీసుకొచ్చింది. అదే విధానాన్ని ఇప్పుడు నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ కు కూడా వర్తింపజేశారు. అయితే సింగరేణి పరిధిలో ఈ నిబంధన అమలుపై పెద్దగా అభ్యంతరాలు రాకపోయినా, నైనీ బ్లాక్ విషయంలో మాత్రం ఫీల్డ్ విజిట్ అనుమతులు, సర్టిఫికెట్ల జారీ పూర్తిగా పారదర్శకంగా జరగలేదన్న ఆరోపణలు వినిపించాయి. అన్నికంపెనీలకు ఒకేసమయంలో, ఒకే విధంగా ఫీల్డ్ విజిట్ అవకాశం ఇవ్వకుండా, ఎంపిక చేసిన సంస్థలకే సర్టిఫికెట్లు ఇచ్చారన్న అనుమానాలే ఈ నిబంధనను చట్టబద్ధత నుంచి వివాదాస్పద స్థాయికి తీసుకువచ్చాయని పలువురు పేర్కొంటున్నారు. మొత్తంగా నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ ప్రక్రియలో విధించిన ఫీల్డ్ విజిట్ తప్పనిసరి నిబంధనే ఈ వివాదానికి మూలంగా మారింది. సిద్ధాంతపరంగా ఇది చట్టబద్ధమైన నిబంధనగా కనిపించినా, అమలులో మాత్రం ఎవరికీ లబ్ధి, ఎవరికీ అడ్డంకి అన్న నిర్ణయాన్ని అధికారుల చేతుల్లోకి తీసుకువచ్చిందన్న విమర్శలు ఉన్నాయి. ఈ నిబంధనను ఆసరాగా చేసుకుని కావలసిన సంస్థలకు మాత్రమే సర్టిఫికెట్లు ఇచ్చి బీడ్ పోటీని నియంత్రించేందుకు ప్రయత్నం జరిగిందన్న ఆరోపణలు తెరపైకి వచ్చాయి.

**ఎవరి ప్రమేయం ఉందన్న ఆరోపణలు..?**

ఈ నిబంధనను సాకుగా చేసుకుని నైనీ గనుల టెండర్ పై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు ఒక ప్రముఖ టీవీ ఛానల్ యాజమాన్యం ఆసక్తి చూపిందన్న ఆరోపణలు బయటకు వచ్చాయి. తమకు అనుకూలమైన సంస్థకు టెండర్ దక్కేలా నిబంధనలను మలిచారన్నది ఈ ఆరోపణల సారాంశం. ఇదే సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన సోదరుడికి చెందిన సుశీ హైటెక్ కంపెనీకి ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు సింగరేణి అధికారులు మీనమేషాలు లెక్కించరన్న ఆరోపణలు కూడా వినిపించాయి. సుశీ హైటెక్ కు సర్టిఫికెట్ వస్తే, భట్టి వర్గం ముందుగా సిద్ధం చేసిన స్కెచ్ కూలిపోతుందన్న భయం పెరిగిందన్న వాదన తెరపైకి వచ్చింది. ఈ దశలో కోమటిరెడ్డి వర్గాన్ని ఎలా అడ్డుకోవాలో తెలియని పరిస్థితిలో, ఒక టీవీ ఛానల్ లో ఆ మంత్రి పై ఉద్దేశపూర్వకంగా ప్రసారమైన కథనం ఈ వ్యవహారాన్ని పూర్తిగా రాజకీయ – మీడియా యుద్ధంగా మార్చింది. ఆ కథనంలో కోమటిరెడ్డి వ్యక్తిగత జీవితాన్ని లక్ష్యంగా చేసుకుని, ఇద్దరు మహిళా ఐఏఎస్ అధికారులను కూడా లాగడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ ఎపిసోడ్ ను చూసిన చాలా మంది ఇది జర్నలిజం ప్రమాణాలకు పూర్తిగా విరుద్ధమన్న అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేశారు.

**ఐఎఎస్ అధికారుల అసాధారణ స్పందన..**

ఆ కథనాలను ఖండిస్తూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రెండు, మూడు ప్రెస్ మీట్ లు పెట్టారు. అందులో 'నా భార్య యాక్సిడెంట్ లో చనిపోయినపుడు సగం చచిపోయాను.. నన్ను మిగతా సగం ఈ టివి ఎపిసోడ్ లు చంపేశాయి' అని అయన చేసిన వాఖ్యలు తెలుగునాట అందరి మనసులను కలిచివేశాయి. దాంతో పాటు ఇద్దరు మహిళా ఐఏఎస్ అధికారులపై వచ్చిన ఈ కథనం తర్వాత అఖిల భారత సర్వీసు అధికారుల్లో తీవ్రమైన అసంతృప్తి వ్యక్తమైంది. దీంతో ప్రభుత్వ ప్రమేయం లేకుండానే ఐఎఎస్ అధికారులు స్వతంత్రంగా సిట్ ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నారు. రాజకీయ ఆదేశం లేకుండానే అధికారుల ఇంతటి స్థాయిలో చర్యకు దిగడం ఈ వ్యవహారంలో అరుదైన పరిణామంగా మారింది. ఈ మీడియా కథనం ప్రభావంతో ఒక మహిళా అధికారి ఆత్మహత్యకు యత్నించటం పరిస్థితిని మరింత తీవ్రంగా మార్చింది. దీని నేపథ్యంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఒక్కతాటిపైకి వచ్చారు. అయితే ఈ మొత్తం వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు నేరుగా స్పందించకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికారుల స్థాయిలోనే సిట్ నిర్ణయం జరిగిందన్న వాదన ఉన్నప్పటికీ, ఈ స్థాయి వివాదంపై రాష్ట్ర నాయకత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

**భట్టి విక్రమార్క ప్రెస్ మీట్**

నైనీ బొగ్గు బ్లాక్ వివాదంపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆదివారం నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో స్పందించారు. నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ తో తనకు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ టెండర్ విషయంలో తన పేరును ఉద్దేశపూర్వకంగా లాగుతూ ఒక వార్తా పత్రికలో ప్రచురించిన కథనం పూర్తిగా దురుద్దేశంతో రాసిందని ఆరోపించారు. తాను గతంలో వైఎస్ఆర్ అభిమానినని, అదే కారణంగా ఆ పత్రిక యాజమాన్యం వైఎస్ఆర్ ను అసహ్యించుకుంటూ తనపై కోపంతో ఇలాంటి కథనాలు రాసిందని వ్యాఖ్యానించారు. తెలంగాణ సంపాదను కొల్లగొట్టేలా కొందరు శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అలాంటి "గద్దల్ని" తన రాష్ట్రంపై వాలనివ్వబోనని భట్టి విక్రమార్క స్పష్టమైన హెచ్చరిక చేశారు. తెలంగాణలో ఎలాంటి కపట రాజకీయ శక్తికీ తాను అవకాశం ఇవ్వనని, రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా పనిచేసే ప్రయత్నాలను గట్టిగా అడ్డుకుంటానని అన్నారు. తాను గత 40 సంవత్సరాలుగా రాజకీయాల్లో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానని, ఇలాంటి చిల్లర పనులు చేయాల్సిన అవసరం తనకు లేదని, అలాంటి పనులు తాను ఎప్పటికీ చేయనని బలమైన సంకేతాలు ఇచ్చారు. వ్యక్తిగత దూషణలతో కూడిన మీడియా కథనాలు ప్రజాస్వామ్యానికి హానికరమని పేర్కొన్న భట్టి విక్రమార్క, టెండర్ ప్రక్రియ అంతా నిబంధనల ప్రకారమే జరుగుతుందని, వాస్తవాలు దాచిపెట్టి కథనాలు రాయడం ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించాలన్న ప్రయత్నాలు సహించబోమని స్పష్టం చేశారు. అయిన సరే నైని బొగ్గు బ్లాక్ పాత టెండర్ ప్రక్రియను రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు.



అయితే ఇప్పుడు ఈ అంశం నైనీ బొగ్గు బ్లాక్ వివాదం, వ్యక్తుల మధ్య గొడవ మాత్రమే కాదు. ప్రభుత్వ రంగ సంస్థల బొగ్గు బ్లాక్ పై ఆధిపత్యం, భవిష్యత్తు గనులపై పట్టు, రాజకీయ ప్రభావం, మీడియాను ఆయుధంగా మలచడం – ఇవన్నీ కలిసిన ప్రయోజనాల పోరాటంగా ఈ వ్యవహారం మారింది. దీనిని కేవలం ఒక నైనీ బొగ్గు బ్లాక్ వివాదంల మాత్రమే కాకుండా.. రాష్ట్ర రాజకీయాలకు ఇది ఒక గట్టి హెచ్చరికగా పరిగణించాలని విశ్లేషకులు అంటున్నారు. పారదర్శకత లేకుండా జరిగే టెండర్లు, మీడియా నైతికతకు లోబడి లేని కథనాలు వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తాయని.. అందుకు ఈ వివాదమే ఓ ఉదాహారణగా నిలుస్తోందని చెబుతున్నారు. ఈ విషయంలో ప్రెస్ మీట్ లు, ఖండనలు సరిపోవు. ప్రతి ప్రక్రియను ప్రజల ముందుంచాల్సిందే అన్న డిమాండ్ కూడా బలంగా వినిపిస్తోంది. లేకపోతే ఈ వివాదం ఒక బ్లాక్ వద్ద ఆగకుండా రాష్ట్ర రాజకీయా రంగు మారే ప్రమాదం ఉందన్న అభిప్రాయం కోల్ బెల్ట్ ప్రాంతాలలో వ్యక్తమవుతోంది.

## ఆత్మీయ కలయికగా గడ్డం కుటుంబ సభ్యులు



**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 18:** పాల్వంచ పట్టణం గట్టాయి గూడెం గ్రామమునకు చెందిన గడ్డం ఇంటిపేరు గల దాదాపు 42 కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని స్థానిక ఆడమ్స్ కళాశాల ఆవరణలోని మామిడి తోట లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు ,ఈ కార్యక్రమం స్థానిక పెద్దలు గడ్డం ముత్యం, గడ్డం శ్రీను, పోతురాజు బాబు , వాడపల్లి ఇస్సాకు ఆధ్వర్యంలో నిర్వహించగా జరిగింది. ఈ కార్యక్రమంలో గడ్డం ఇంటి పేరు గల దివంగత గడ్డం నరసయ్య, నరసమ్మలకు చెందిన 142 మంది గడ్డం కుటుంబ సభ్యులు ఒకే ప్రాంతంలో చేరి ఒకరి అభిప్రాయాలను ఒకరు పంచుకోవడం, వృద్ధులైన వారిని సత్కరించుకోవడం, పిల్లలు, పెద్దలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో నాలుగు తరాల గడ్డం వారి కుటుంబాలు కలుసుకున్నారు.

## పెంట్లం గ్రామానికి గర్వకారణమైన యువతీ యువకులకు సన్మానం

- . కేంద్ర రక్షణ దళాలు, బ్యాంకింగ్ రంగాల్లో ఎంపిక



**అన్నపురెడ్డిపల్లి, జనవరి 18, ప్రజా జ్యోతి :** అన్నపురెడ్డిపల్లి మండలం పెంట్లం గ్రామపంచాయతీలో గ్రామానికి గర్వకారణంగా నిలిచిన యువతీ యువకులను పెంట్లం గ్రామ సర్పంచ్ కారం శివ, ఉప సర్పంచ్ టీ. వస్రం, గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. గ్రామానికి చెందిన బన్నే కవిత తండ్రి వెంకటేశ్వర్లు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో మేనేజర్గా ఉద్యోగం సాధించగా, వెంగళ హరీష్ తండ్రి శ్రీను ఉద్యోగం సీఐఎస్ఎఫ్‌లో, సున్న వెంకటేష్ తండ్రి నాగేశ్వరరావు ఉద్యోగం బీఎస్ఎఫ్‌లో, ఓర్సు గోపి సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికై గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ కారం శివ మాట్లాడుతూ గ్రామ యువత ఉన్నత ఉద్యోగాల్లో రాణించడం ప్రతి కుటుంబానికి గర్వకారణమని పేర్కొన్నారు. యువత కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులు కూడా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ గ్రామ పెద్దల ఆశీస్సులు తమ విజయానికి మరింత ప్రోత్సాహంగా నిలిచాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ టీ. వస్రం, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నాయుడుపేటలో ఎన్టీఆర్ 30వ వర్ధంతి




**దమ్మపేట,జనవరి. 18 (ప్రజాజ్యోతి) :** మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతిని నాయుడుపేట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలుగువాడి ఆత్మగౌరవాన్ని, కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన మహానీయుడు అన్న ఎన్టీఆర్ అని, రాజకీయాలకు నూతన నిర్వచనం ఇచ్చి కోట్లాది జీవితాల్లో వెలుగులు నింపిన యుగపురుషుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు, నందమూరి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించారు.

# బీజాపూర్ ఎన్ కౌంటర్ మావోయిస్టుల గుర్తింపు

- ఆరుగురు మావోయిస్టుల మృతి
- మృతి చెందిన వారిలో నలుగురు మహిళలు
- ఎన్‌కౌంటర్ స్థలం నుండి ఏ కె -47, ఇన్సాస్ రైఫిల్ , 303 రైఫిల్ స్వాధీనం



**చర్ల, జనవరి 18:(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ ప్రాంతంలో పోలీసులు నక్సలైట్ల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌కు సంబంధించి శనివారం జరిగిన సెర్చ్ ఆపరేషన్‌లో భద్రతా దళాలు మరో ఇద్దరు యూనిఫాం ఉన్న మావోయిస్టు కేడర్ల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాయి. వారి నుండి ఒక ఇన్సాస్ రైఫిల్ .303 రైఫిల్ కూడా స్వాధీనం చేసుకున్నారు. దీనితో, బీజాపూర్ ఎన్‌కౌంటర్ లో సెర్చ్ ఆపరేషన్‌లో మొత్తం ఆరుగురు మావోయిస్టు కేడర్‌లను స్వాధీనం చేసుకున్నారు, వీరిలో నలుగురు మహిళా నక్సలైట్లు ఉన్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఎన్‌కౌంటర్ స్థలం నుండి ఏ కె –47, ఇన్సాస్ , కార్బైన్ .303 రైఫిల్‌తో సహా మొత్తం ఆరు గ్రేడెడ్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం నుండి నేషనల్ పార్క్ ప్రాంతంలో డి ఆర్ జి కోబ్రా స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్ టి ఎఫ్ ) సంయుక్త బృందం సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు బీజాపూర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ కాలంలో, భద్రతా దళాలు మావోయిస్టుల మధ్య అనేక అడపాదడపా కాల్పులు జరిగాయి అని అన్నారు .నేషనల్ పార్క్ ఏరియా కమిటీలో పేరుమోసిన సభ్యులుగా గుర్తించిన మృతిచెందిన మావోయిస్టు కార్యకర్తలలో డి వి సి ఏం దిలీప్ బెడ్జా, ఏ సి ఏం మద్వి కోసా, ఏ సి ఏం లక్కీ మడ్కం పార్టీ సభ్యురాలు రాధా మెట్టా ఉన్నారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మరో ఇద్దరు నక్సలైట్ల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది అని అధికారులు తెలియచేసారు .బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ పట్టిలింగం మాట్లాడుతూ, బస్తర్ ప్రాంతంలో శాంతి భద్రత ప్రజా సంక్షేమాన్ని నిర్ధారించడానికి భద్రతా దళాలు అత్యంత అంకితభావంగా వృత్తిపరమైన నిబద్ధతతో పనిచేస్తున్నాయని అన్నారు. సాయుధ మావోయిస్టులపై ఖచ్చితమైన నిర్ణయాత్మక కార్యకలాపాలు కొనసాగుతాయి అని ప్రస్తుతం, చుట్టుపక్కల అడవులు కొండ ప్రాంతాలలో ఇంటెన్సివ్ సెర్చ్ ఆపరేషన్లు జరుగుతున్నాయి అని అన్నారు .



DVCM दिलीप वेंड्जा
नेशनल पार्क एरिया कमेटी
ईनाम -08.00 लाख रूपये



ACM माड़वी कोसा
नेशनल पार्क एरिया कमेटी
ईनाम 05.00 लाख रूपये



PM जुगलो वंजाम
नेशनल पार्क एरिया कमेटी
ईनाम 02.00 लाख रूपये



ACM पालो पोड़ियम
नेशनल पार्क एरिया कमेटी
ईनाम 05.00 लाख रूपये

## ఎన్టీఆర్ విగ్రహం వద్ద 30వ వర్ధంతి

**టేకులపల్లి,జనవరి18,ప్రజాజ్యోతి:** మండల కేంద్రంలో స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు గారి 30 వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గుడిపూడి మోహన్ రావు,ఎన్టీఆర్ అభిమానులు ఆదివారం బస్టాండ్ సెంటర్ లోని నందమూరి తారక రామారావు విగ్రహనికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అన్న సూక్తిని మొదటిసారిగా రాజకీయాలకు పరిచయం చేసిన మానవతావాది నిరుపేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన మహనీయుడు ఎన్టీఆర్ బడుగు బలహీన వర్గాల వారికి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన సమతావాది స్త్రీలకు సాధికారతనిచ్చిన సంస్కర్త స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఆ మహానాయకుని స్మృతికి నివాళులర్పిద్దాం అని వారు తెలిపారు. ఎన్టీఆర్ ఆశయ సాధనలో అనుక్షణం పని చేస్తామని, ఆయన అడుగుజాడలలో తెలుగు తమ్ముళ్లు నడుస్తామని తెలిపారు. ఆయుగా పురుషుని వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నాము అని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు గోరంట్ల రవి, గుడిపూడి కృష్ణార్జునరావ్, ఏపూరి వెంకన్న, కూచిపూడి నాగయ్య,రాయల రాజేష్, మూడ్



కుమార్,రాయల నాగయ్య, బొగ్గారపు అజయ్, తోటకూరి జయంత్, సామినేని సతీష్,తోటకూరి సందీప్, గుడిపూడి హరీష్,బోడ హిమసాయి,నెల్లూరి శ్రీను, రాయల శ్రీవాస్,రాయల ఉద్యన్ అర్రివ్,తోటకూరి ఆయుష్,రవి,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ 30వ వర్ధంతి వేడుకలు

- . మహానాయకుడు ఎన్టీఆర్ ఆశయాలు తరతరాలకు స్ఫూర్తి కావాలని నివాళులు

**అన్నపురెడ్డిపల్లి, జనవరి 18, ప్రజాజ్యోతి :** అన్నపురెడ్డిపల్లి మండలం పెంట్లం గ్రామంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. అశ్వారావుపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ కట్రం స్వామి దొర ఆదేశాల మేరకు నర్సింగ్ సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామ మెయిన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించగా, పార్టీ జెండా ఆవిష్కరణ కూడా జరిగింది. నర్సింగ్ సుధాకర్ మాట్లాడుతూ, "హిందుత్వం, తెలుగుదనం, ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రోత్సహించడంలో మహానాయకుడు ఎన్టీఆర్ అమిత స్ఫూర్తిగా నిలిచారు. సినిమా రంగంలో నవరసాలకు ప్రతిరూపంగా నిలిచిన ఆయన, రాజకీయాల్లో ప్రజల మధ్యే నాయకుడు." అన్నారు. ఆయన పాలనలో "రాజకీయాలు అధికారానికి కాదు, బాధ్యతకు ప్రతీక" అని నిరూపించారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చేపట్టిన పాలన ప్రజాహితానికి అద్దంపట్టిందని పేర్కొన్నారు. రూ.2కే బియ్యం పథకం, పేదల సంక్షేమం, గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్యం



ఇవ్వడం ఆయన పాలనకు స్ఫూర్తిదాయకం అని అన్నారు. నటనలో దేవుడిగా పూజింపబడిన ఎన్టీఆర్, రాజకీయాల్లో ప్రజల మధ్యే ఉండే నాయకుడిగా చరిత్రలో నిలిచారని, ఆయన ఆశయాలు, ఆత్మగౌరవ సందేశం తరతరాలకు స్ఫూర్తిగా నిలవాలని నర్సింగ్ సుధాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పానుగంటి రామారావు, గ్రామ అధ్యక్షుడు నర్సింగ్ విక్కీ, వల్లెపు వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కారం శివ, ఉప సర్పంచ్ తేజవత్ వస్రం, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఐద్వా ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలి

- జనవరి 25న భాగ్య నగరానికి తరలిరావాలి
- ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. జ్యోతి




**భద్రాచలం, జనవరి 18,ప్రజాజ్యోతి :** హైదరాబాద్‌లో ఈ నెల 25 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. జ్యోతి పిలుపునిచ్చారు. భద్రాచలంలో ఆదివారం ఐద్వా భద్రాచలం పట్టణ కమిటీ సమావేశం నాదెళ్ల లీలావతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎం. జ్యోతి ప్రసంగించారు. సమాజంలో సగభాగానికి పైగా ఉన్న మహిళలు నేటికీ తీవ్ర అణచివేతకు గురవుతున్నారని, లైంగిక వేధింపులు, అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల హక్కుల పరిరక్షణ, చట్టాల అమలు కోసం ఐద్వా దేశవ్యాప్తంగా నిరంతరం ఉద్యమాలు చేపడుతోందని తెలిపారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మనువాద సిద్ధాంతాలను అమలు చేయాలని ప్రయత్నిస్తూ, సనాతన ధర్మం పేరుతో మహిళలను పాతకాల పరిస్థితులకు నెట్టివేయాలని చూస్తోందని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో స్వేచ్ఛ, సమానత్వం, స్త్రీ విముక్తి, ప్రజాస్వామ్యం అనే నినాదాలతో ఐద్వా ముందుకు సాగుతోందని తెలిపారు. మహిళా హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఐద్వా అఖిల భారత మహాసభలు హైదరాబాద్‌లో జరుగుతున్న నేపథ్యంలో, ఈ నెల 25న నిర్వహించనున్న బహిరంగ సభకు మహిళలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి. సీతాలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జీవన జ్యోతి, వై. పూర్ణిమాదేవి, పట్టణ కమిటీ సభ్యులు ఉస్తెల జ్యోతి, జి. నాగలక్ష్మి, కె. రమణ, చెన్నూరి వెంకటరమణ, సుశీల, ఎస్.కే. చోటిమా, కనకశ్రీ, డి. నాగలక్ష్మి, సరోజిని, సిహెచ్. ధనలక్ష్మి, ఎస్. రమా తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ తెలుగు జాతి ఆత్మగౌరవానికి చిరస్థాయీ ప్రతీక - చౌదరి వెల్ఫేర్ అసోసియేషన్



**దమ్మపేట,జనవరి. 18 (ప్రజాజ్యోతి) :** తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని రాజకీయ అజెండాగా మలిచిన మహానేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి సందర్భంగా చౌదరి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు. అన్న ఎన్టీఆర్ ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకమని నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా చౌదరి వెల్ఫేర్ అసోసియేషన్ బిల్డింగ్‌లోని అన్న ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షులు పోతినేని శ్రీరామ్ వెంకట్రావు హాజరై మాట్లాడుతూ, అన్న ఎన్టీఆర్ ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ పాలన చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గడ్డిపాటి సత్యం, పారుపల్లి భద్రం, కొంక శ్రీనివాసరావు, అల్లాడ రమాదేవి, తూమాటి మల్లేశ్వరరావు, బొల్ల మోహన్ రావు, ఈలప్రోలు కిరణ్ బాబు, యలమర్తి కిషోర్ కుమార్, పారుపల్లి రజిని, పెనికిలపాటి హరి నాయుడు, పెనికిలపాటి కృష్ణయ్య తదితరులు పాల్గొని అన్న ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు.

# బోడులో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి



**టేకులపల్లి,జనవరి18,ప్రజాజ్యోతి:** తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 30వ వర్ధంతి సందర్భంగా బోడులో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగాటీడీపీ నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు, జ్ఞాపకాలు తెలుగు ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచి ఉంటాయని అన్నారు.ఒకవైపు వెండితెరపై అద్వితీయమైన నటనతో కోట్లాది మంది అభిమానాన్ని చూరగొని,మరోవైపు రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేసి తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన యుగపురుషుడు ఎన్టీఆర్ అని కొనియాడారు.ఈకార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు రేఖ రామచంద్రం,మాసిపాక రామస్వామి,చిలివేరి నాగేశ్వరరావు,కొలుకూరి రవిశంకర్,పునేం కృష్ణయ్య,ఇరప సమ్మయ్య పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ 30 వ వర్ధంతి




**చర్ల,జనవరి 18:(ప్రజాజ్యోతి):** చర్లలో ఆదివారం మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 30 వ వర్ధంతి స్థానిక అంబేద్కర్ సెంటర్ లో టి డి పీ దిమ్మ వద్ద మాజీ రైతు క్లబ్ చైర్మన్ కొత్తపల్లి ఆంజనేయులు ,టిడిపి కార్యకర్తలు అభిమానులు యెన్ టి ఆర్ కు ఘన నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా కొత్తపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ రాజకీయాల్లో విప్లవం అంటే యెన్ టి ఆర్ అని పేదల పాలనకు చిరునామా అని ప్రజానాయకుడుగా తాను ముఖ్యమంత్రిగా పేద ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్నారు అని రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చి పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు అని తెలిపారు .ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు రేగల్ల సుధాకర్, మండల నాయకులు నల్లూరి శ్రీను, గుర్రాల చిన్న ,బాసిబోయిన నాగేశ్వరరావు ,పూజారి కొండబాబు, సురేంద్ర, రంగు ముత్తయ్య ,బెత ప్రసాద్, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైద్య చికిత్సకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేత

**భద్రాచలం, జనవరి 18,ప్రజాజ్యోతి :** క్యాన్సర్‌తో బాధపడుతున్న భద్రాచలానికి చెందిన శేషు కుమార్‌కు వైద్య చికిత్స కోసం వసుధ ఫౌండేషన్ రూ.10వేల ఆర్థిక సహాయం అందజేసింది. తనకు ఆర్థిక సహాయం చేయాలని శేషు కుమార్ కుటుంబ సభ్యులు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామ రాజు ను కోరారు. ఈ అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన మంతెన వెంకటరామరాజు, వసుధ ఫౌండేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ శ్రీనివాసరాజుకు ఆర్థిక సహాయం అందజేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి. రవీంద్రనాథ్ చేతుల మీదుగా రూ.10 వేల చెక్కును బాధితునికి అందజేశారు.

# జీవో నెం 3 పై సేవాలాల్ సేన పోరాటం

- సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్



**టేకులపల్లి,జనవరి18,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ఆదివారం సేవాలాల్ సేన జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ పాల్గొని, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 05 వ తేదీ శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో, ఫిబ్రవరి 12 గురువారం టేకులపల్లి మండల కేంద్రంలో సేవాలాల్ సేన మండల స్థాయి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరిజన నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేయాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. జీవో నెంబర్ 3 సుప్రీంకోర్టు రద్దు వల్ల గిరిజన నిరుద్యోగులు గణనీయంగా నష్టపోతున్నారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఇల్లందు మండలం మార్చి 25 నుంచి ప్రారంభించి మార్చి 29వ తేదీ వరకు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. జీవో నెంబర్ 3 స్థానంలో మరొక కొత్త జీవో తీసుకువచ్చి గిరిజనులకు మేలు చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటులో గిరిజనుల పాత్ర ముఖ్యమైనదని ఆయన అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచారని గుర్తు చేశారు. పోడు భూములకు పూర్తి సర్వే చేసి హక్కు పత్రాలు కల్పించాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బోడ రమేష్, అధికార ప్రతినిధి బానోత్ నాగరాజు, ప్రచార కార్యదర్శి జరుపుల లాలు, మండల అధ్యక్షులు బానోతు కిషన్, బోడ బాలు, పవన్ కళ్యాణ్, బోడ శేఖర్, ధరావత్ కొక్క, ధరావత్ బాలు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్యకు స్వర్ణ పుష్పార్చన, అభిషేకం

- వెండిశంఖం తయారీకి రూ.1.90 లక్షల విరాళం



**భద్రాచలం, జనవరి 18,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఆదివారం ఆర్జిత సేవలలో భాగంగా స్వర్ణ పుష్పార్చనతో పాటు ప్రత్యేక అభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణం కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో రామయ్యకు వెండిశంఖం తయారు చేయించేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి చెందిన శ్రీధర్ కుటుంబ సభ్యులు రూ.1.90 లక్షలను విరాళంగా అందజేశారు. వారు ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఈ విరాళాన్ని దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె. దామోదర్ రావుకు అందజేశారు

# తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి బి. అరుణ్ బాబు

**ములకలపల్లి, జనవరి 18, ప్రజాజ్యోతి :** మండలంలోని రెవెన్యూ పట్టాదార్ పాస్ పుస్తకం కలిగిన రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ (ఫార్మర్ ఐడి) చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి. అరుణ్ బాబు ఆదివారం ఓ ప్రకటన లో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న వివిధ వ్యవసాయ పథకాల లబ్ధి పొందడానికి ఫార్మర్ ఐడి తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా పీఎం కిసాన్ పథకం లబ్ధి పొందేందుకు ఫార్మర్ ఐడి అనివార్యమని, బీమా, సబ్సిడీలు, రుణాలు, ప్రభుత్వ పథకాలు వేగంగా అందుతాయని, మోసాలు తగ్గించవచ్చని వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు నెంబర్, భూమి పాసుబుక్ వివరాలు, ఆధార్ కు లింక్ అయిన మొబైల్ నెంబర్ తీసుకొని సమీపంలోని మీసేవ కేంద్రంలో కేవలం రూ.15 చెల్లించి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రైతు వేదికలలో వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా ఉచితంగా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కావున మండలంలోని రైతులందరూ సమీప మీసేవ కేంద్రంలో గానీ, రైతు వేదికలోని వ్యవసాయ విస్తరణ అధికారి ద్వారా గానీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.



## నేడు గిరిజన దర్బార్



**భద్రాచలం, జనవరి 18,ప్రజాజ్యోతి :** భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో నేడు నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటిడిఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని ఆయన సూచించారు. ఇందుకోసం సంబంధిత యూనిట్ అధికారులు ఉదయం 10.30 గంటలకు ఐటిడిఏ సమావేశ మందిరంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

## డాక్టర్ గీతా పావని జన్మదినం సందర్భంగా సరోజ ఆశ్రమంలో అన్నదానం

♦ రూ.10 వేల విరాళం అందజేత




**భద్రాచలం, జనవరి 18,ప్రజాజ్యోతి :** సూర్య హాస్పిటల్ కు చెందిన డాక్టర్ గీతా పావని (ఎండి నెఫ్రాలజీ అండ్ పీడియాట్రిక్స్) జన్మదినాన్ని పురస్కరించుకుని సరోజ ఆశ్రమంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో అన్నదానం కోసం రూ.10 వేల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సూర్య హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పవన్ రెడ్డి (ఎండి) పాల్గొని, సమాజ సేవలో భాగంగా పేదలు, అనాథల సంక్షేమానికి ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. జన్మదినాలు, ప్రత్యేక సందర్భాలను సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు గాదె మాధవ రెడ్డి, జయచంద్ర రెడ్డి, సునీల్ తో పాటు సూర్య హాస్పిటల్ సిబ్బంది పాల్గొని ఆశ్రమ వాసులకు భోజనం అందించారు. ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ గీతా పావనికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## తెలుగు ప్రజల 'అన్న' ఎన్టీఆర్ – చిరస్మరణీయుడు

● ఎన్టీఆర్ సేవలు ఎన్నటికీ మర్చిపోలేము : టిడిపి మండల అధ్యక్షుడు రామారావు



**అన్నపురెడ్డిపల్లి, జనవరి 18, ప్రజా జ్యోతి:** తెలుగు రాష్ట్రంలో 'అన్న' అని పలికితే ముందుగా గుర్తుకు వచ్చేది నందమూరి తారక రామారావు అని అన్నపురెడ్డిపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామారావు అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంస్కరణాత్మక చట్టాలను తీసుకువచ్చి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు. ఎన్టీఆర్ భౌతికంగా దూరమై 30 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా రాజపురం గ్రామంలోని గంగిరెద్దుల బజార్ సెంటర్ వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ దిమ్మె సమీపంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బన్నె కృష్ణయ్య ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పేదల పక్షపాతిగా, ప్రజల హృదయాల్లో 'అన్న'గా నిలిచిన ఎన్టీఆర్ ఆశయాలు రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరని పేర్కొన్నారు. ఆయన పాలనలో తీసుకున్న నిర్ణయాలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జానపాటి శ్రీను, చెన్నుబోయిన లక్ష్మణ్, సత్యం, ఇళ్ల శ్రీను, దండి అప్పయ్య, అన్నపురెడ్డి సుబ్బారావు, రామారావు, రవి, బుడుపులు చెన్నారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు జాతి ఆత్మగౌరవ శిల్పికి ఘన నివాళులు

**దమ్మపేటలో ఘనంగా అన్న ఎన్టీఆర్ 30వ వర్ధంతి వేడుకలు**



**దమ్మపేట,జనవరి.18 (ప్రజాజ్యోతి):** తెలుగు జాతికి ఆత్మగౌరవాన్ని అందించిన మహానేత, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతిని పురస్కరించుకొని దమ్మపేట మండలంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళుల కార్యక్రమాలు నిర్వహించారు. అన్న ఎన్టీఆర్ సేవలు, ఆశయాలు తరతరాలకు మార్గదర్శకమని నాయకులు కొనియాడారు. ఆదివారం దమ్మపేట బాలాజీ థియేటర్ సెంటర్ లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మిఠాయిలు పంచుతూ అన్న ఎన్టీఆర్ ప్రజా సంక్షేమానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. అదేవిధంగా పట్వారి గూడెం సెంటర్ లోని అన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద కూడా ఘనంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఎండి వలీపాషా, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ కట్టం ఎర్రప్ప, మాజీ ఉప సర్పంచ్ దారా యుగంధర్, నాయుడు వీరస్వామి, నాయుడు బాబురావు, నాయుడు సుబ్బారావు, బంధం శ్రీవాసరావు, బోగి సత్యం, కణితి లక్ష్మణరావు, వార్డు సభ్యులు రూపా రాంబాబు, పసుమర్తి రామభద్ర, ఉయ్యాల లక్ష్మీనారాయణ, భుక్య రాజు, శోభుల వెంకటేశ్వరరావు, షేక్ మౌలాలి, దయాకర్, సజ్జా రాంబాబు, చెర్ర ధర్మారావు, పానుగంటి మణికంఠ, డొక్కా ప్రకాశ్, పొదిలి కృష్ణ, రూపా నాగరాజు తదితర నాయకులు, కార్యకర్తలు, మాజీ వైస్ ఎంపీపీ సున్నం బుల్లయ్య నందమూరి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ అంటే ఒక చరిత్ర

♦ తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత ఎన్టీఆర్..... మాజీ ఎంపీపీ కేసరి లక్ష్మణరావు

♦ టిడిపికి పూర్వవైభవం తీసుకురావాలి: మండల నాయకులు కోమళ్ల దుర్గాప్రసాద్




**ములకలపల్లి, జనవరి 18, ప్రజాజ్యోతి:** దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 30వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంతో పాటు జగన్నాథపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు చల్ల వెంకటేశ్వర్లు జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. జగన్నాథపురం ప్రధాన కూడలిలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేసరి లక్ష్మణరావు లు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. దూరమై నేటికి ముప్పై సంవత్సరాలు గడిచినా, ప్రతి తెలుగువారి హృదయంలో ఎన్టీఆర్ సజీవంగా నిలిచిపోయారని పేర్కొన్నారు. మహానాయకుడి స్ఫూర్తితో యువత ముందుకు వచ్చి సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలుగుదేశం పార్టీ మండల నాయకులు కోమళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ముఖ్యంగా యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొని, తెలుగుదేశం పార్టీకి మండల స్థాయిలో పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కంటే రామకృష్ణ, తన్నీరు చిన్న పుల్లయ్య, తోట పావన్, కనకం వెంకటేశ్వర్లు, ఛాయాదేవి, పలగాని వెంకటరమణ, జంపాల హరికృష్ణ, సీనియర్ నాయకులు గంగిశెట్టి సత్యనారాయణ, శెనగపాటి సుదర్శన్, కొయ్యల పెద్ద పుల్లయ్య, సీతారాములు, ఈర్ల గాంధీ, శ్రీరాముల వెంకన్న, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓట్లు వేసి ఆదరించండి



**ఇల్లందు, జనవరి 18, ప్రజాజ్యోతి:** ఇల్లందు మున్సిపాలిటీలో గత పాలకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు ఆలోచించి బిఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేసి ఆదరించాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ కోరారు. ఆదివారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ తో కలిసి మున్సిపల్ పరిధిలోని 11, 12, 13, 14, 15, 16, 17, 18 వార్డులలో విస్తృత పర్యటన చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రతి ఓటర్ ను కలిసి బిఆర్ఎస్ ను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికలలో ఎలా ఓట్లు అడుగుతున్నారని, మోసపూరిత హామీలను ఇచ్చి వాటిని అమలు చేయకుండా కార్యాలయం చేయడం ఏమిటని విమర్శించారు. 2 ఏళ్లలో ఇల్లందు మున్సిపాలిటీకి ఇచ్చిన నిధులు చేసిన అభివృద్ధిని చూపించి ఓట్లు అడగండని సూచించారు. ఆనాడు బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులకు శంకుస్థాపన చేసిన శిలాఫలకాలకు మార్చి మార్చి మరల శంకుస్థాపనలు చేస్తున్నారే తప్ప ఇల్లందు మున్సిపాలిటీకి తీసుకువచ్చిందేమిటని ఒక్కసారి ఓటర్లు ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జబ్బార్, సీనియర్ నాయకులు సిలివేరు సత్యనారాయణ, పరిచూరి వెంకటేశ్వర్లు, ఎస్ రంగనాథ్, అబ్దుల్ నబీ, మాజీ కౌన్సిలర్లు జెకె శ్రీనివాస్, కడకంచి పద్మ, సంద బిందు, చీమల సుజాత, పాబోలు స్వాతి, నాయకులు గిన్నారపు రాజేష్, రాచపల్లి శ్రీను, చాంద్ పాషా, సర్దార్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నరాటి నాయకత్వంలో ఖమ్మం తరలిన కామ్రేడ్లు





**ములకలపల్లి,జనవరి 18, ప్రజాజ్యోతి:** ఖమ్మంలో నిర్వహించనున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతాబ్ది ఉత్సవాలకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్ నాయకత్వంలో ఆదివారం ఉదయం నుంచే కార్యకర్తలు ఉత్సాహంగా ఖమ్మం బయలుదేరారు.ఈ సందర్భంగా నరాటి ప్రసాద్ మాట్లాడుతూ, వందేళ్ల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలు ప్రతి కమ్యూనిస్టు కార్యకర్తకు గర్వకారణమని అన్నారు. కార్మికులు, రైతులు, పేదల హక్కుల కోసం పార్టీ చేసిన త్యాగాలు, పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు పార్టీ శ్రేణులకు నూతన ఉత్సాహం, ప్రేరణను అందిస్తాయని తెలిపారు. శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో పాల్గొంటున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎండి యూసుఫ్, సహాయ కార్యదర్శి, నరాటి రమేష్, మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ జబ్బార్, రంజిత్, రవీందర్, ఇమానేలు, పువ్వాల లాలితారావు, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.